# బుజ్జగింపులు షురూ..!

- మెదక్ బరిలో 53 మంది అభ్యర్థులు
- నామినేషన్ల ఉపసంహరణకు అభ్యర్థులతో నేతల మంతనాలు
- వివిధ పార్టీలకు చెందిన 18 మంది, ఇండిపెండెంట్లుగా 35 మంది

మెదక్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): మెదక్ ఎంపీ స్థానానికి ఏకంగా 54 మంది నామినేషన్లు వేశారు. ఒక్కరి నామినేషన్ తిరస్కరణకు గురయ్యింది. ప్రధాన పార్టీ అభ్యర్థులు ఇండిపెండెంట్ అభ్యర్థులను బుజ్జగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు. మెదక్ ఎంపీ ఎన్నికల్లో గెలుపు కోసం అన్ని పార్టీల నేతలు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులకు మించితే రెండు ఈవీఎంలు ఉపయోగించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఘట్టం పూర్తయ్యింది. రిటర్నింగ్ అధికారి శుక్రవారం నామినేషన్లను పరిశీలించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక నామినేషన్‌ను తిరస్కరించారు. దీంతో 53 మంది బరిలో ఉన్నారు. అభ్యర్థులు అధిక సంఖ్యలో ఉండడంతో సుమారు 5 ఈవీఎంలను ఉపయోగించాల్సి వస్తుంది.

### 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ

నామినేషన్ల ఉపసంహరణకు సోమవారంతో గడువు ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికల బరిలో నుంచి ఇండిపెండెంట్లుగా పోటీ చేసిన అభ్యర్థులతో కొందరు మంతనాలు సాగిస్తున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక ఈవీఎంలో 16 గుర్తులు ఉంటాయి. అందులో చివరిది నోటాకు కేటాయిస్తారు. పోటీలో 15 మందికి మించితే రెండో ఈవీఎంను ఉపయోగించాల్సి ఉంటుంది. మెదక్ ఎంపీ స్థానంలో 53 మంది బరిలో ఉండగా, 38 మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకోవాల్సి ఉంటుంది. దీంతో వివిధ పార్టీలకు చెందిన ముఖ్య నేతలు ఇండిపెండెంట్ అభ్యర్థులకు తాయిలాలు చూపి పోటీ నుంచి తప్పుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు. స్వతంత్రుల ప్రయత్నాలు ఏ మేరకు ఫలించనున్నాయో సోమవారం తేలనున్నది.

## నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తాం



కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

**- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు**

నిజాంపేట, ఏప్రిల్ 27: నిజాం షుగర్ ఫ్యాక్టరీని త్వరలోనే పునఃప్రారంభిస్తామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శనివారం చల్మెడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్‌లోకి చేరికల సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. మండలానికి చెందిన 350 మంది ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలకు ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి రాగానే మొదటగా రాజ్యాంగం మార్చేందుకు కుట్ర చేస్తుందని, దీంతో దళిత, బహుజన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. చేతి గుర్తుకు ఓటేసి మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధిరాములు, మాజీ సర్పంచులు ప్రీతి, నర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రమేశ్, ఆలయ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు ముత్యంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మారుతి, నసీరొద్దీన్, లింగంగౌడ్, రాములు, యాదగిరి, లక్ష్మణ్, రమేశ్, దేమె యాదగిరి, నాగరాజు, రవి, రాములు, అజయ్, రాజయ్య ఉన్నారు.

## మాతా శిశు సంరక్షణ బాధ్యత అందరిది

సమావేశంలో మాట్లాడుతున్న మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ

**మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ**

నర్సాపూర్, ఏప్రిల్ 27: మాతా శిశు సంరక్షణ బాధ్యత అందరిదని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ తెలిపారు. శనివారం నర్సాపూర్‌లోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ 44వ వార్షికోత్సవం, ఫ్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే సీడీపీవో హేమభార్గవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల నిర్వహణ వాటి సేవలు బాగున్నాయని కితాబిచ్చారు. విద్యా, ఆరోగ్యవంతమైన సమాజం అవసరమని, అందుకోసం అంగన్‌వాడీలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సీడీపీవో హేమభార్గవి మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో నర్సాపూర్, రామాయంపేట్ ఐసీడీఎస్ ప్రాజెక్టులు 1980లో ఏర్పడ్డాయన్నారు. నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ప్రారంభం నుంచి విధులు నిర్వహిస్తున్న 9 మంది సీనియర్ అంగన్‌వాడీలు, ఆయాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ ఝాన్సీ, డీడబ్ల్యూవో బ్రహ్మాజీ, ఏఆర్‌ఈ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సునీత, టీఎన్‌జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్, రాజ్‌కుమార్, ఎంపీడీవో మధులత, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

## జానపద గేయ విభాగంలో మెదక్ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉప కులపతి రవీందర్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 27: ఈనెల మొదటి వారంలో నిర్వహించిన సాహిత్య, సాంస్కృతిక రాష్ట్ర స్థాయి పోటీల్లో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభచూపారు. ఈ పోటీల్లో జానపద గేయ బృంద గాన విభాగంలో కళాశాల విద్యార్థులు శ్రీధర్, స్వాతిక, విద్య, మనోజ్ఞ, కృపలత ప్రథమ స్థానంలో నిలిచారు. శనివారం ఉస్మానియ విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఓయూ ఉప కులపతి రవీందర్ విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

## పిల్లలతో అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలు

న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అనిత

నర్సాపూర్, ఏప్రిల్ 27: చిన్నపిల్లలతో అసభ్యకరంగా ప్రవర్తించి, హింసకు గురి చేస్తే చట్టరీత్యా శిక్షించబడతారని జూనియర్ సివిల్ జడ్జి అనిత అన్నారు. శనివారం నర్సాపూర్‌లోని కోర్టులో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి అనిత మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు చేసినప్పుడు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. భార్యాభర్తల మధ్య విభేదాలు పెంచుకుని దాంపత్య జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం లీగల్ సర్వీస్ బెంచ్ ద్వారా పలు పీఎల్‌సీ కేసులను పర్సు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు స్వరూపరాణి, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై పుష్పరాజ్ పాల్గొన్నారు.

## బేతాళస్వామికి వైభవంగా బోనాలు

అల్లాదుర్గం, ఏప్రిల్ 27: అల్లాదుర్గంలోని బేతాళ స్వామి జాతర వైభవంగా కొనసాగుతున్నది. శనివారం ఉత్సవాల్లో భాగంగా బేతాళ స్వామికి బోనాలు సమర్పించారు. ఆలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలను తిలకించడానికి వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉత్సవాల్లో కీలక ఘట్టమైన బేతాళస్వామికి బండ్ల ప్రదర్శన బుధవారం నిర్వహించనున్నారు.

## బీజేపీ అధికారంలోకొస్తే రాజ్యాంగం దెబ్బతింటుంది

మాల మహానాడు నాయకులు

పాపన్నపేట, ఏప్రిల్ 27: కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే రాజ్యాంగం దెబ్బతినే ప్రమాదం ఉందని జాతీయ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ అన్నారు. శనివారం పాపన్నపేటలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో 380 నుంచి 400 లోక్‌సభ సీట్లు బీజేపీకి వస్తే రాజ్యాంగాన్ని పక్కన పెట్టే అవకాశం ఉందన్నారు. దీంతో బడుగు బలహీన వర్గాలకు రక్షణ ఉండదన్నారు. అందుకే ప్రజలు బీజేపీకి ఓటేయవద్దన్నారు. ఎన్నికల్లో ఐక్యంగా ఉండి తమ సత్తా చూపించాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివ, జిల్లా గౌరవధ్యక్షుడు ఇమాన్యూయేల్, యూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు నరేశ్, నాయకులు యాదగిరి, కుమార్, లింగం, అనిల్ కుమార్ తదితరులున్నారు.

## ప్రతిభ కనభరిచిన విద్యార్థులకు సన్మానం

గురుకుల విద్యార్థులను సన్మానిస్తున్న జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జెమ్లానాయక్

నర్సాపూర్, ఏప్రిల్ 27: ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాల నర్సాపూర్ (బాలుర)-1 విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. జి.బాలకృష్ణ 465/470, మోహన్ యాదవ్ 454/470, అక్బర్ అలీ 382/470 మార్కులతో ఉత్తీర్ణతులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జెమ్లానాయక్ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంఘమేశ్వర్, జూనియర్ లెక్చరర్లు భాస్కర్, అఫ్షాన్, ఫిర్దౌస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీని లాభాల బాట పట్టించాలి

నర్సాపూర్ ఆర్టీసీ బస్టాప్‌ను పరిశీలిస్తున్న ఆర్ఎం ప్రభులత

నర్సాపూర్, ఏప్రిల్ 27: ఆర్టీసీని లాభాల బాట పట్టించాలని రీజనల్ మేనేజర్ ప్రభులత అన్నారు. శనివారం నర్సాపూర్ ఆర్టీసీ డిపో, బస్టాప్, పెట్రోల్ పంపును డీఎం సుధాతో కలిసి ఆర్ఎం ప్రభులత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఎం ప్రభులత మాట్లాడుతూ ప్రతి నెల ఆదాయ, వ్యయాలపై సమీక్ష ఉంటుందన్నారు. ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. బస్టాండ్‌లోని దుకాణదారులు సకాలంలో అద్దెలు చెల్లించాలని ఆదేశించారు. వీరితోపాటు అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు, ఎస్టీఐ లక్ష్మణ్, డిప్యూటీ ఈఈ మనోహర్‌రావు, డిపో ఇన్‌చార్జి శ్యామ్‌సుందర్ గౌడ్, సిస్టం సూపర్‌వైజర్ వెంకటేశ్‌గౌడ్, అసిస్టెంట్ ఏఈ రాథోడ్, ఏఈ అనుపమారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## విగ్రాం శ్రీనివాస్‌గౌడ్‌కు గౌరవ డాక్టరేట్

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 27: రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు ద్వారా అందించిన సామాజిక సేవలకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ పీస్ డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీసెస్‌ను విగ్రాం శ్రీనివాస్‌గౌడ్‌కు శనివారం అందజేశారు. యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ గ్లోబల్ అక్రిడిటేషన్ కౌన్సిల్ జర్మనీ ఊటీలో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో అవార్డు అందజేశారు. కార్యక్రమంలో అనీష్‌గౌడ్, చేనేత సహకార సంస్థ మాజీ చైర్మన్ మహంకాళి కృష్ణమూర్తి, లోకేశ్, సిద్దు, తదితరులు ఉన్నారు.

విగ్రాం శ్రీనివాస్‌గౌడ్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న బాధ్యులు

## గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

పాతూరులో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**

మెదక్‌రూరల్, ఏప్రిల్ 27: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్యాలా, జానకంపల్లి, తిమ్మనగర్, పాతూరులో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని పద్మాదేవేందర్‌రెడ్డి శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పదేండ్లలో తెలంగాణకు ఏమీ చేయలేదన్నారు. కేసీఆర్ ఆశీస్సులతో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలన్నారు. తండాలు అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ హయాంలో జరిగిందన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, మండల అధ్యక్షుడు ఆంజాగౌడ్, కోఆప్షన్ సభ్యుడు షాకీర్, నాయకులు కిష్టయ్య, బాలయ్య, సుదర్శన్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

కూచారంలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకొంటున్న నాయకులు

మనోహరాబాద్, ఏప్రిల్ 27: మండలంలోని కూచారంలో బీఆర్ఎస్ నాయకుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నాయిని ఉదయ్‌రంజన్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు కిష్టారెడ్డి, వీరేశ్, నందుగౌడ్, రమేశ్ ముదిరాజ్, ప్రేమ్, నరేశ్‌గౌడ్, మధుగౌడ్, భిక్షపతి, రవి, శ్రీను, మురళి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

విలేకరులతో మాట్లాడుతున్న పాకాల శ్రీహరిరావు

రామాయంపేట, ఏప్రిల్ 27: స్వామినాథన్ కమిటీ సిఫారుసు మేరకు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రాష్ట్ర రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు డిమాండ్ చేశారు. శనివారం రామాయంపేటకు విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓట్ల కోసం బీజేపీ రాష్ట్ర ప్రజలు, రైతులను మరోసారి మోసం చేస్తున్నదన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేయద్దన్నారు. సమావేశంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, రామాయంపేట మాజీ సర్పంచ్ పల్లె రాంచందర్‌గౌడ్, జహీరుద్దీన్, కోనాపూర్ సొసైటీ డైరెక్టర్ మామిడి సిద్దిరాములు పాల్గొన్నారు.

## గౌతోజిగూడెంలో వైద్య శిబిరం

మనోహరాబాద్, ఏప్రిల్ 27: మండలంలోని గౌతోజిగూడెంలో సీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ ఉప సర్పంచ్ పంచమి రేణుకుమార్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జేఎన్‌టీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ శోభారాణి, ఆఫీసర్ నిఖిల, సతీశ్, సీఎంఆర్ దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లికి తలకొరివి పెట్టిన తనయ

రామాయంపేట, ఏప్రిల్ 27: మండలంలోని రాయిలాపూర్ గ్రామంలో అనారోగ్యంతో శనివారం మృతిచెందిన తల్లికి తన తలకొరివి పెట్టింది. రాయిలాపూర్ గ్రామానికి చెందిన చాకలి మల్లవ్వ(50) అనారోగ్యంతో మంచాన పడింది. ఆమె భర్త నర్సింహులు 15రోజుల క్రితం దుబాయ్ నుంచి గ్రామానికి వచ్చాడు. వివిధ దవాఖానల్లో పరీక్షలు చేయించాడు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కూతుర్లు చిన్నకుతురు సంధ్య తల్లికి తలకొరివి పెట్టింది.

తల్లి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కూతురు

## నేడు వెల్దుర్తి, శివ్వంపేటలో మాజీ మంత్రి హరీశ్‌రావు రోడ్‌షో

వెల్దుర్తి, ఏప్రిల్ 27: వెల్దుర్తిలో నేడు మాజీ మంత్రి హరీశ్‌రావు రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ రమేశ్‌గౌడ్ తెలిపారు. బీఆర్ఎస్ గెలుపు కోసం ఈ రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ రోడ్ షోలో ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి పాల్గొంటారన్నారు. వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లోని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు.

### శివ్వంపేటలో..

శివ్వంపేట, ఏప్రిల్ 27: శివ్వంపేటలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు రోడ్డు షో నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రోడ్డు షోలో ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరుకానున్నట్టు తెలిపారు. రోడ్ షో కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## పూరిగుడిసె దగ్ధం..

దగ్ధమైన నివాస పూరిగుడిసె వద్ద మంటలు ఆర్పుతున్న స్థానికులు

వెల్దుర్తి, ఏప్రిల్ 27: పూరిగుడిసె దగ్ధమైన ఘటన మాసాయిపేట మండలంలోని అచ్చంపేటలో శనివారం తెల్లవారుజామున జరిగింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడ సత్తయ్యకు చెందిన పూరి గుడిసెకు సుమారు 3గంటల ప్రాంతంలో మంటలు అంటుకుని కాలిపోతుండడంతో గమనించిన సత్తయ్య, ఇరుగుపొరుగు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. పెద్దగా ఎగిసిపడ్డ మంటలతో గుడిసె పూర్తిగా కాలిపోయింది. ఆ గుడిసెలో ఉన్న బియ్యం, బట్టలు, వంటసామాగ్రి, ఆధార్‌కార్డులు, ఇతర వస్తువులు, 15 గ్రాముల బంగారం, 8 తులాల వెండి వస్తువులు కాలిపోయాయన్నారు. సత్తయ్య, భార్య గుడిసెలో నిద్రించకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

రామాయంపేట, ఏప్రిల్ 27: రాయిలాపూర్ గ్రామంలో మహిళా శిశు సంక్షేమశాఖ, స్వాధార్ స్వచ్ఛంద సంస్థ సమన్వయంతో ఉపాధి కూలీల వద్దకెళ్లి మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై శనివారం అవగాహన కల్పించారు.

## బాధితుడికి ఆర్థిక సాయం

నిజాంపేట, ఏప్రిల్ 27: నగరం గ్రామానికి చెందిన కాస్తి సిద్ధిరాములు అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని డా.మోహన్‌నాయక్ శనివారం రూ.5 వేలను మాజీ సర్పంచ్ గేమ్‌సింగ్ ద్వారా అందజేశారు.

## రైతులను మోసం చేసిన కాంగ్రెస్

చేర్యాల, ఏప్రిల్ 27 : అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు రైతులను అన్ని విధాలుగా మోసం చేసిందని చేర్యాల ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్ ఆరోపించారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాకముందు డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న సర్కారు పెద్దలు ఇప్పుడు దేవుండ్ల పై నాడునేడు అంటూ ఒట్టు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని సర్కారు మర్చిపోయిందని, రైతుబంధుకు దిక్కే లేదని, అసలు మున్ముందు రైతుబంధు ఉంటుందో ఊడుతుందోనని అనుమానం వ్యక్తం చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PLOT FOR SALE**

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్డు, SBI, దగ్గర, 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. వివరాలకు సంప్ర: 8143366630, 9989554915.
NT-328130

★121 గజాలు ప్లాటు 3 లక్షలు, EMI రూ. 10,000/- ప్రతి నెల ఒకరికి ప్లాటు, ఎలక్ట్రిక్ స్కూటర్, గోవా టూర్ ఉచితంగా పొందండి. ఫోన్: 9128245456.
NT-97222

**WANTED**

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.